# "పోలీసు న్యాయం"

అప్పుడు రాత్రి పది గంటలయింది. మా వంటేది కడుపునొప్పితో ఉంగముట్టుకు పోతుంటే శ్రీమతి పావని దుఃఖం మిళితమైన స్వరంతో అంది "త్వరగా మందు తీసుకురండి!" అని.

పది రోజుల క్రితం అలానే వంటి దానికి కడుపు నొప్పి వస్తే డాక్టరుకు చూపించి ఆయన రాసిచ్చిన మందు వాడితే తగ్గిపోయింది. అదృష్టవశాత్తూ ఆ చీటీ జేబులోనే వుండడంతో, గబగబా సైకిలు బయటకు తీసి, మార్కెట్‌కు బయలుదేరాను.

జీతం రావడానికి ఇంకా మూడు రోజు లుండడంతో ఏదైనా అవసరం వస్తుందని అతి జాగ్రత్తగా దాచిన రెండైదులు మాత్రం జేబులో ఉన్నాయ్. త్వరగా మందు తీసుకు రావాలన్న ఉద్దేశ్యంతో సైకిలు స్పీడుగా తొక్కుతూ, ప్రక్క సందులోకి టర్న్ తిప్పుదామనుకుంటున్నంతలో ఎదురుగా పోలీసు ప్రత్యక్షమయ్యాడు. వెంటనే నేను సైకిలు దిగాను. పోలీసు నా వెనకాలే పరుగెత్తుకుంటూ వచ్చి సైకిలు హేండిల్ పట్టుకున్నాడు.

'మా వంటేదానికి ఒంట్లో బాగోలేదు సార్! అందుకే మందు తీసుకురావడానికి వెడుతున్నాను' నా పరిస్థితి వివరించబోయాను.

'అయినా సరే! లైటు లేకుండా సైకిలు తొక్కడం తప్పు. సైకిలు స్టేషన్‌కు పోనీ! రేపు కోర్టు కొచ్చి ఫైన్ కడుదువుగాని!' కరుగ్గా అన్నాడా పోలీసు.

'నేను చెప్పింది అర్థం చేసుకోండి సార్! మా వంటే పిల్ల కడుపునొప్పితో బాధపడుతోంది. దయచేసి నన్నొదిలేయండి. మీకు పుణ్యం ఉంటుంది' అతడిని ప్రాధేయపడ్డాను. వంటేది గుక్క తిప్పకుండా ఏడవడం గుర్తుకొచ్చి నా కళ్ళల్లో నీళ్ళు సుళ్ళు తిరిగాయి. అతను ససేమిరా వదల నన్నాడు. ఓ పావుగంట బతిమలాడినా అతని మనసు కరగలేదు. సైకిలుకి లైటు లేకుండా తొక్కితే యాక్సిడెంట్లవుతాయనీ, ఒక్కోసారి ప్రాణాపాయం కూడా కలగవచ్చనీ ఓ పది నిముషాలు నాకు చిన్న సైజు లెక్చరిచ్చాడు. నా దగ్గరున్న రెండు ఐదుల్లో ఒకదానితో అతని చేయి తడిపితే, నన్ను దయతలచి వదిలేశాడు. మందులషాపతను తెల్సున్న వాడు కావడంతో, నా దగ్గరున్న ఐదు రూపాయ లిచ్చి మిగిలింది తర్వాత ఇస్తానని చెప్పి మందు తీసుకెళ్ళి, వంటేదానికి తాగించి, అది హాయిగా నిద్రపోయిందాకా నా మనసు కుదుటపడలేదు.

సైకిలుకి లైటు వేయించాలని చాలా కాలం నుంచి అనుకుంటూ వున్నా, చాలీ చాలని జీతంతో దానికి తోడు ప్రతి నెలా అనుకోకుండా ఏదో అదనపు ఖర్చులు తగలడంతో వీలుపడలేదు. ఆ మర్నాడే అప్పు చేసి సైకిలుకి లైటు వేయించి, తృప్తిగా శ్వాస పీల్చుకున్నాను.

ఇది జరిగిన పది రోజులకనుకుంటాను. బజారులో పని చూసుకొని, రాత్రి 9 గంటలకు ఇంటికెళుతున్నాను. నా సైకిలుకి ఎదురుగా మరో సైకిలు వస్తోంది. ఇంకాస్త దగ్గరగా వచ్చాక చూశాను. ఆరోజు సైకిలుకి లైటు లేదని నా దగ్గర ఐదు రూపాయలు వసూలుచేసి, సైకిలుకి లైటు లేకపోతే కలిగే దుష్పరిణామాల గురించి క్లాసు తీసుకొన్న పోలీసు నన్ను చూసి కూడా చూడనట్టు తలొంచుకు ముందుకు సాగిపోయాడు సైకిలు స్పీడు పెంచుతూ. పోలీసు న్యాయం అంటే ఏమిటో అర్థం అయిన నేను ఓ నిట్టూర్పు విడిచాను. కారణం అతను తొక్కుతున్న సైకిలుకి లైటు లేదు.

—శ్రీధర శ్రీరామ కృష్ణ.

